www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 4 ఫిబ్రవరి 2025

5

చిత్తూరు

సిపిఎం రాష్ట్ర మహాసభ ర్యాలీ

నెల్లూరులో సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సిపిఎం చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, జిల్లా నాయకులు గిరిధర్ గుప్తా, ఓబుల్ రాజు, భువనేశ్వరి, నాయకులు రాజా, జయంతి, ఈశ్వరయ్య, సుబ్రహ్మణ్యం, ధనలక్ష్మి, శ్రీరాములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మా గోడు వినండి..

- ఇంటి పట్టాలివ్వండి..
- పట్టా భూమి ఆక్రమించుకున్నారు..
- కలెక్టర్‌ను ఆశ్రయించిన యానాదులు

సాగుభూములకు రక్షణ కల్పించాలని కోరుతున్న యానాదులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 'ఉండేందుకు ఇల్లు లేదు ఇంటి పట్టాలివ్వండి...భూమిలేని మాకు ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూములను సైతం భూ స్వాములు లాగేసుకుంటున్నారు.. రక్షణ కల్పించండి..' అంటూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు వివిధ మండలాల నుండి వచ్చిన యానాదులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ముందు తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. కలెక్టరేట్ కొత్త స్పందన హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమల, చౌడేపల్లి, సదుం, వెదురుకుప్పం మండలాలకు చెందిన యానాదులు భూసమస్యలు, భూ ఆక్రమణలు, ఇంటి పట్టాలు, గృహాలు వంటి సమస్యలపై కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ కు అర్జీలు అందించారు. సదుం మండలం, బురగమంద పంచాయతీ, గాదివారి పల్లి ఎస్ టి కాలనీకి చెందిన సుబ్బరాజు తమకు ప్రభుత్వం అందజేసిన డికెటి పట్టా భూమిని తమ తాతల కాలం నుండి వ్యవసాయం చేసుకుంటున్నామని అయితే మా గ్రామానికి సంబంధించిన కొందరు పెత్తందారులు మండల స్థాయి అధికారులతో కలిసి 1బిలో పేరు మార్చుకున్నామని వారు ఇప్పుడు వచ్చి భూమి తమకు చెందిందని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. సోమల మండలం ముచ్చుకాల్వ యానాది కాలనీకి చెందిన 20 కుటుంబాలకు చెందిన యానాదులు సోమల మండలం పెటూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 540 - 607, పెద్దఉప్పరపల్లి మండలం, పెద్దఉప్పరపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్ 211 - 211- 2ఏ , 211-2బి లో సుమారు 50 ఎకరాల భూమి సుమారు 20 కుటుంబాల యానాదులకు 1996 సంవత్సరంలో డికెటి పట్టాలు ప్రభుత్వం మంజూరు చేసిందని, అప్పటి నుండి మేము సాగు చేసుకుంటున్నామని, అటవీ హక్కుల చట్టం 2005 ప్రకారం ఆర్ ఓ ఎఫ్ ఆర్, పట్టాలు మంజూరు చేయాలని, మార్చి 2022లో రెవెన్యూ, అటవీ, గిరిజన శాఖల అధికారులు కలసి గ్రామసభ నిర్వహించి తీర్మానం చేసి ఆ రిపోర్టును జిల్లా అటవీ శాఖ అధికారికి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కి పంపామని ఆ తర్వాత జాయింట్ సర్వే చేయాలని గతంలో చాలా సార్లు స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇచ్చామని కానీ ఇంతవరకు జాయింట్ సర్వే చేయలేదని దయచేసి జాయింట్ సర్వే చేసి తమకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఆ రాజశేఖర్, పి ఉమాపతి కలెక్టర్ కు అర్జీ అందజేశారు. చౌడేపల్లి మండలం దిగువపల్లి పంచాయతీ, మొట్లపల్లి యానాది కాలనీకి చెందిన సర్వే నెంబర్ 256 లో మూడు ఎకరాల వ్యవసాయ భూమి తమ తాతల కాలం నుండి మా అనుభవంలో ఉందని, తాము 2005 నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తూ బోరు వేసి మామిడి చెట్లు నాటు కున్నామని తెలిపారు. ఇటీవల కొందరు మదిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు కొందరు వచ్చి 'ఈ భూములు మాకు చెందినవి' అని మమ్మల్ని భూమిలోకి రానీయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల తహశీల్దారుకి విన్నవించుకోగా తహశీల్దారు, సర్వేయర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని వై వరలక్ష్మి , వై ధనలక్ష్మి వాపోయారు. వెదురుకుప్పం మండలం, తిరుమలయ్య గారి పల్లి ఎస్టీ కాలనీకి చెందిన నక్కల వాళ్లు సుమారుగా 30 సంవత్సరాలు గా జీవిస్తున్నామని, మాకు ఎలాంటి భూములు లేవని ఇప్పుడు భూములను ఆక్రమిస్తున్నారు ఆక్రమించుకున్నారని, తమకు ఎలాంటి జీవనాధారం లేదని దయచేసి భూములు, గృహాలు, తాగునీరు ఇప్పించాలని కోరారు.

ప్రత్యేక శ్రద్ధ వహించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాలులోని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, డి ఆర్ ఓ మోహన్ కుమార్, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై అధి కారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పని చేయాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేస్తామని ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కారం చాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమా ధా నాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షిస్తా మని, అర్జీలు రీ-ఓపెన్ అయితే వాటికి కారణాలను వివరించాలని ఆదేశించారు.

మొత్తం 226 అర్జీలు

రెవెన్యూ శాఖకు 171, పంచాయతీ శాఖకు 1, పోలీస్ శాఖకు 16, సాంఘీక సంక్షేమ శాఖ 1, పశు సంవర్ధక శాఖ 2, విద్యాశాఖ 2, డిసిహెచ్ఎస్‌కు 1 అర్జీ అందాయి. డి ఆర్‌డిఏ 18, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 4, ఏపిఎస్ పిడిసిఎల్ 2, డిఎస్ఓ 2 , రహదారులు, భవనాల శాఖ 1, కాలుష్య నివారణ శాఖ 1, జాతీయ రహదారుల శాఖ 2, ఎస్ ఈ పంచాయతీ రాజ్ 1, ఎం పిడిఓ జి డి నెల్లూరు 1 అర్జీ అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, డిఆర్ఓలకు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

ఎద్దు కోసం .. సెల్ టవర్ ఎక్కి రైతు ఆత్మహత్యాయత్నం!

ప్రజాశక్తి - రామకుప్పం: ఎద్దు కోసం మండల కేంద్రంలోని బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి రైతు పాల్పడ్డ సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మణీంద్రం గ్రామానికి చెందిన ప్రసాద్ రెడ్డి (56) గత రెండు సంవత్సరాలుగా తాను పెంచి పోషించుకుంటున్న ఎద్దు సంక్రాంతి పండుగలు తప్పిపోయింది. అప్పటి నుంచి పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం కెంచనపల్లె సముద్రం గ్రామంలో ఎద్దు పండుగ నిర్వహించారు. మండలంలోని గోవిందరాజపురం గ్రామానికి చెందినవారు ఎద్దు పండుగలు ఎద్దును పరుగులు తీయించారు. ఆ ఎద్దును చూసిన ప్రసాద్ రెడ్డి తమ ఎద్దు ఇక్కడ ఉందని విషయాన్ని పెద్ద మనుషులకు చేరవేశాడు. ఎంత చర్చించినా ఫలితం లేకపోవడంతో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డాడు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని కుప్పం అగ్నిమాపక సిబ్బంది సాయంతో ప్రసాద్ రెడ్డిని కిందకి దించారు. స్థానిక పోలీసులు అతడిని విచారణ చేపట్టి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న రైతు

కాణిపాకంలో వసంత పంచమి వేడుకలు

ప్రజాశక్తి-ఐరాల: పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం కాణిపాకం దేవస్థానంలో వసంత పంచమీ పర్వదినం పురస్కరించుకుని మహా సరస్వతీ యాగం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం కాణిపాకం దేవస్థానంలోని ఆస్థాన మండలంలో ఆలయ వేద పండితులు మహా సరస్వతీ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగాహాజరై భక్తులు, విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూతలపట్టు నియోజకవర్గంలో ఐదు మండల ప్రభుత్వ, సంక్షేమ హాస్టల్స్ లోని సుమారు 2,500 మంది పదోవ తరగతి విద్యార్థినివిద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు, కంకణా లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే మాట్లాడుతూ "విద్యార్థులు కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఆయన తెలిపారు. విద్యార్థులు మీ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రస్తుత ప్రపంచంలో విద్య మాత్రమే మీరు ఎదగడానికి బలమైన ఆయుధమని ఆయన గుర్తుచేశారు. కాణిపాకంలో విద్యాభ్యాసం విషయం సీఎం దృష్టికి తీసుకెళ్లి అక్షరాభ్యాసం కాణిపాకంలో అధికారికంగా తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఐరాల మండల అధ్యక్షులు గిరిధర్ బాబు, కాణిపాకం దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, నియోజకవర్గ నాయకులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రక్త పరీక్షలు నిర్వహించండి

జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అక్కడక్కడా మలేరియా, డెంగీ జ్వరాలు కనిపిస్తున్నా యని రక్త పరీక్షలు విరివిగా చేపట్టాలని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్ ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ల్యాబ్ టెక్నీషియన్లను ఆదేశించారు. ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి మాట్లాడుతూ ఆర్‌డిటి కిట్లు ద్వారా రక్త పరీక్షలు చేయాలన్నారు. యాక్టివ్, పాసివ్ పరీక్షలను విరివిగా చేసి పాజిటివర్లను నిర్ధారణ చేసి చికిత్స ప్రారంభించాలన్నారు. ఆర్టిటి కిట్లలో డెంగీ పాజిటివ్ వస్తే ఎలిసా పరీక్షకు జిల్లా ఆస్పత్రికి పంపి పరీక్షించి నిర్ధారణ చేసి వెంటనే చికిత్స ప్రారంభించాలని సూచించారు. దీని ద్వారా డెంగీ మరణాలు నివారించవచ్చున్నారు. ప్రతి కేసును ఐహెచ్ఐపి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. దోమలు వ్యాప్తి కాకుండా ,దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు, పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో నిర్వహిం చాలన్నారు. డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ 10 పర్సెంట్ ఓపీలో తప్పని సరిగా టీబీ పరీక్షలు చేయాలన్నారు. పి హెచ్ సిలో ప్రతి ఆశ కార్యకర్త ప్రతివారం గల్ల పరీక్ష కిట్ల ద్వారా క్వాలిటీ గల్లను అనుమానిత కేసుల నుంచి సేకరించి పిహెచ్‌సిలో పరీక్షించాలని సూచించారు. డాక్టర్లు, సూపరువైజర్లు వీటన్నింటినీ మానిటర్ చేస్తూ పాజిటివ్ వచ్చిన పేషెంట్స్‌కి చికిత్స ప్రారంభించి పూర్తి అయ్యే టట్లు చూడాలని ఆదేశించారు. 2025 కు టీబీ లేని సమాజ స్థాపనే అందరి ధ్యేయం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, ఏఎంఓ రామచంద్ర రెడ్డి, శివకుమార్, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

ప్రమాదంపై ఎంపీ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన చిత్తూరు జిల్లా, నగరి మండలం, రామాపురం వద్ద ఆదివారం చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంపై చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన ఆయన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని అధికారులకు సూచించారు. దురదృష్టవశాత్తు చోటుచేసుకున్న ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసు కోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పీఈఎస్ వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: పీఈఎస్ వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి అలైడ్ హెల్త్ సైన్సెస్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ తరగతుల ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్ కృష్ణారావు, పీఈఎస్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సత్యశీలన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ హెల్త్ కేర్ రంగంలో అలైడ్ హెల్త్ సైన్సెస్ పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. వైద్య సేవలందించే విధానం లో బహుళ శాస్త్ర విధానానికి అవసరాన్ని వ్యక్తం చేస్తూ, అలైడ్ హెల్త్ నిపుణులు డయాగ్నోస్టిక్స్, థెరప్యూటిక్ కేర్, రిహాబిలిటేషన్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన వివరించారు. పీఈఎస్ వైద్య కళాశాల విద్యలో ప్రపంచ స్థాయి బోధనా విధానాలు, ప్రాక్టికల్ క్లినికల్ ఎక్స్‌పోజర్, ఆధునిక విద్యా వనరులు అందిస్తున్నట్లు వివరించారు. 'మేము విద్యార్థులను సమర్థవంతమైన ఆరోగ్య నిపుణులుగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నాం' అని ఆయన పేర్కొన్నారు. పీఈఎస్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ, వైస్ ప్రిన్సిపల్ కళాశాల సృజనాత్మక విద్యా వాతావరణాన్ని ప్రశంసించారు. అలైడ్ హెల్త్, ఫిజియోథెరపిస్టుల తోడ్పాటుతో రోగుల సేవలలో కీలక పాత్ర పోషిస్తు న్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న వైద్య కళాశాల వైద్యులు

ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిఎస్పి సాయినాథ్

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రజల నుండి అందిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిఎస్‌పి సాయినాథ్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని జిల్లా ఎఆర్ పోలీసు కార్యాలయంలో డిఎస్‌పి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి 37 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం లేకుండా, వాటిని సమర్థవంతంగా పరిష్కరించాలని డిఎస్‌పి అధికారులను ఆదేశించారు. ఫిర్యాదు దారులు జిల్లా నలుమూలల నుంచి వచ్చి డిఎస్పీ ని కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఫిర్యాదులపై స్పందించి బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులన్నింటిపై చట్టపరమైన విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 37 ఫిర్యాదులు అందాయని తెలిపారు. కుటుంబ తగాదాలు ఏడు, వేధింపులు మూడు, ఇంటి తగాదాలు ఐదు, భూ తగాదాలు పన్నెండు, డబ్బు తగాదాలు ఐదు, దారి తగాదాలు ఐదు ఫిర్యాదులు అందాయని తెలిపారు.

ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కు ఐదు వినతులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఐదు వినతులు అందాయని నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమ వారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీక రించారు. ఈ కార్యక్రమంలో పింఛనుకు రెండు, ఇంజనీరింగ్‌కు ఒకటి, టౌన్ ప్లానింగ్‌కు ఒకటి, , మెప్మాకు ఒకటి చొప్పు న మొత్తం ఐదు వినతులు అందా యని తెలిపారు. క్షేత్ర స్థాయిలో విచారించి వాటిని పరిష్క రించాలని వినతులను సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజల వినతుల పరిష్కా రానికి అధిక ప్రాధా న్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్ర మంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, ఏసీపీ నాగేంద్ర ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను మెరుగుపరుద్దాం: డిఎస్‌పి

ప్రజాశక్తి -విజయపురం, నగరి : పట్టణ పరిధిలో ట్రాఫిక్‌ను మెరుగు పరచడానికి ప్రత్యేక వ్యూహ రచన చేసినట్లు డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ తెలిపారు. టవర్‌క్లాక్ జంక్షన్‌లోని వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల నడిపేవారు, పూల దుకాణాల వారికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ స్థితిగతులను మెరుగుపరచడం, రోడ్డు ప్రమాదా లను నిరోధించడంపై ప్రత్యేక దృష్టి సారించామని డిఎస్‌పి ఈ సందర్భంగా తెలిపారు. పట్టణ ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే తోపుడు బండ్లవారు రోడ్డు మార్జిన్‌కు వెలుపల బండ్లు పెట్టుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండు ప్రాంగణం, ఏకాంబరకుప్పం రైల్వేగేట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ కు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తా మన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఏమాత్రం అతిక్రమించినా జరిమానాలు తప్పవన్నారు. చెరకు లోడ్డు ట్రాక్టర్ల రాత్రి 9 గంటలపైనే రోడ్డుపై వెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుందామన్నారు. అందరూ సహకరిస్తే ట్రాఫిక్‌లో మార్పులు తీసుకువచ్చి ప్రజలకు ఎలాంటి సమస్యలేకుండా చూద్దామన్నారు. ఎదుటి వారికి ఇబ్బంది కలిగించకూడదన్న ఉద్దేశంతో వీధి వ్యాపారులు నడుచుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులతో చర్చిస్తున్న అధికారులు

ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశం రసాభాస

ప్రజాశక్తి - సదుం : సదుం తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు మారూఫ్ హుస్సేన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సమావేశం రసాభాసగా మారింది. ఈ సందర్భంగా బయట నుండీ వచ్చిన బాస్ నాయకులు సదుం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక దళిత నాయకులు బయట నుంచి వచ్చిన ఒక సామాజిక వర్గ సంఘంతో సమావేశం నిర్వహించడం సబబు కాదని, స్థానిక ఎస్సీ, ఎస్టీ సభ్యులతో కమిటీ వేయాలని స్థానిక దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీంతో స్థానిక తహశీల్దారు స్థానిక దళిత నాయకులు కోరారు. మూడు రోజుల్లో ఎస్సీ, ఎస్టీ సభ్యులను పిలిచి కొత్త కమిటీ వేస్తానని ఇందుకు దళిత సంఘాలకు నాయకులకు హామీ ఇచ్చి, తొందరగా సమావేశాన్ని ముగించి వెళ్లి పోయారు. ఈ కార్యక్రమంలో స్థానిక దళిత సంఘాల నాయకులు మల్లేపల్లి శ్రీనివాసులు, వెంకటరత్నం, మల్లెల గిరి, చింతపల్లి రామచంద్రయ్య, శరత్ కుమార్, ప్రభాకర్, వెంకట్రామయ్య, భాస్కర, ఎర్రయ్య తదితర దళిత నాయకులు, దళిత రైతులు పాల్గొన్నార.

మాట్లాడుతున్న ఎస్‌సి, ఎస్‌టి నాయకులు

కూటమి ప్రభుత్వం కూలిపోతుంది..

- నాగబాబు వ్యాఖ్యలు ఖండిస్తున్నాం
- దౌర్జన్యాల ప్రభుత్వం ఎంతోకాలం నిలువదు
- మాజీ ఎంపీ రెడ్డప్ప

ప్రజాశక్తి -పుంగనూరు: కూటమి ప్రభుత్వం అర్థాంతరంగా కూలిపోవడం ఖాయమని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప జోష్యం చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఛాంబర్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమల మండల కేంద్రంలో జరిగిన జనసేన సభలో నాగబాబు వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని, నిరసన తెలుపుతున్నామన్నారు. వైసిపి నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని తమపై ఉసిగొలుపుతూ దౌర్జన్యాలకు పాల్పడడం, వారు చేపట్టే ప్రయత్నాలన్నీ విఫలమైపోతాయన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో కూలిపోతుందన్నారు. ముద్రగడ పద్మనాభం ఇంటిపై టిడిపి అల్లరి మూకలు దాడి, ఇల్లు కూల్చివేయడం లాంటి అక్రమాలు, దౌర్జన్యాలు చేసే ప్రభుత్వాలు ఎంతకాలం ఉంటాయని ప్రశ్నించారు. ప్రజలు ఆగ్రహించేవరకు ఓపిక పట్టాలని పాలక పార్టీకి సూచించారు. పాలన ప్రభుత్వానికి సంబంధించి తాము ఎక్కడా మాట్లాడడం లేదని ఓ క్రమశిక్షణతో వెళుతున్నామన్నారు. అయినా కూటమి నాయకులు అవాకులు చవాకులు పేలుతుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. తామంతా తమ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి చెప్పినట్టే నడుచుకుంటామన్నారు. పరిపాలన ఎవరికి శాశ్వతం కాదని తిరిగి జగన్మోహన్ రెడ్డి సీఎం అవుతారని జోష్యం చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాష, రాయలసీమ మైనార్టీ సెల్ కో ఆర్డినేటర్ పక్రుద్దీన్ షరీఫ్, మైనార్టీ నాయకుడు వహాబ్, రమణ, విజయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డప్పరెడ్డి

పట్ట పగలే పట్టణంలో దొంగలు

భయం గుప్పెట్లో పట్టణ వాసులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలో సోమవారం పట్టపగలే రెండు చోట్ల దొంగతనాలు చోటు చేసుకున్నాయి. దీంతో పట్టణ వాసులు భయాందోళనకు గురవు తున్నారు. పట్టణ పరిధి లోని సెరికల్చర్ కార్యాలయ సమీపంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల ఇంట్లో దొంగతనం జరిగిందని బాధితులు తెలిపారు. వారి కథనం మేరకు గణపతి, అముదా దంపతులు వృత్తిరీత్యా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఉదయం ఉద్యోగానికి వెళితే సాయంకాలం ఇంటికి తిరిగి వస్తామని, ఇటీవల సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడానికి అదునుగా తీసుకున్న దొంగలు సోమవారం దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు. ప్రతిరోజు మాదిరే ఉద్యోగానికి వెళ్లి సాయం కాలానికి ఇంటికి వచ్చి చూస్తే ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తిం చామన్నారు. ఈ దొంగతనంలో రెండు లక్షల రూపాయల నగదు, రెండు కేజీల వెండి, 250 గ్రాముల బంగారు అపహర ణకు గురైందని తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయితే సామాజిక మాధ్య మాలలో ప్రచారం జరుగుతున్నట్టు పట్టణంలో చోటు చేసుకున్న మరో దొంగతనంపై నిజా నిజాలను పోలీసులు వెల్లడించాల్సి వుంది. పట్టణ వాసులకు తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం వుంది.

బీరువా తాళాలు పగలగొట్టి వున్న దృశ్యం

మాట్లాడుతున్న బాధితులు



జాబ్ మేళాలో 16 మంది ఎంపిక

ప్రజాశక్తి - విజయపురం, నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జెకెసి) నిర్వహించిన జాబ్ మేళాలో 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వేణుగోపాల్ మాట్లాడుతూ డిగ్రీతో పాటు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చే మార్పులను గమనించి వాటిపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని కోరారు. జీతంతో పాటు వచ్చే అనుభవం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ జాబ్ మేళాకు హాజరైన 20 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ, నైపుణ్యం కలిగిన 16 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల జెకెసి కోఆర్డినేటర్ డాక్టరు పంకజ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టరు ఇందిరా ప్రియదర్శిని, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ డాక్టరు రేవతి, జెకెసి మెంటార్ లాల్ బాషా, కంపెనీల ప్రతినిధులు హరీష్, దొరబాబు, ఆయేషా, పార్థసారధి పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సోమవారం నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 11వ వార్డు పరిధిలో చెరువుముందర కాలనీలో నూతనంగా నిర్మించిన మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకం చేశారు. గ్రామస్తులు, ఆలయ అర్చకులు ఎమ్మెల్యేని పూలమాలతో ఘనంగా సత్కరించి ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పలమనేరు రోడ్డులో హంగ్రీ బోర్డ్ రెస్టారెంట్, మురకం బట్టులో డీఐ మ్యాక్స్ థియేటర్, పార్టీ జోన్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పా ల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

సరస్వతి పూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ మేటి మంద ప్రాథమిక పాఠశాలలో సోమవారం వసంత పంచమి సందర్భంగా సరస్వ తీ పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ప్రధానోపాధ్యా యురాలు లత ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతి చిత్రపటానికి పూజలు చేశారు. మాఘ మాసంలో వచ్చే వసంత పంచమి రోజు సరస్వతీ పూజ నిర్వహిస్తారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులు పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను ప్రధాన ఉపాధ్యాయురాలు అందించి స్వీట్లు పంచిపెట్టారు.

పూజలు నిర్వహిస్తున్న హార్వార్డ్ స్కూలు కరస్పాండెంటు భాస్కర్

హార్వార్డ్ స్కూలులో..

చిత్తూరుఅర్బన్: స్థానిక రామ్‌నగర్ కాలనీల్లో హార్వర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో సోమవారం ఘనంగా సర్వతీపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగు సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేలా ముఖ్యమైన తెలుగు పండుగలతో పాటు ప్రతి ఏటా సర్వతిపూజ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అహ్లాదకరమైన వాతావరణంలో విశాలమైన తరగతి గదులతో హార్వాడ్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల అనుభవజ్ఞులైన ఉపాధ్యాయిని ఉపాధ్యా యులతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేద, మధ్యతరగతికి అందుబాటు ఫీజులతో నాణ్యమైన విద్యను అందింస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ విద్య, విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఆర్థిక సాయం

ప్రజాశక్తి- తవణంపల్లి: అరగొండ పంచాయతీ నల్లపరెడ్డిపల్లి గ్రామానకి చెందిన కె రమేష్ ఆకస్మికంగా మృతి చెందాడు. అతని మృతి వార్త తెలుసుకున్న తవణంపల్లి మండలం అరగొండ ఎంపీటీసీ, అరగొండ మాజీ సర్పంచ్ జీ కరీం తన అనుచరుల ద్వారా ఐదువేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. జీ కరీం ప్రస్తుతానికి తాను అందుబాటులో లేని కారణంగా వారికి నల్లపరెడ్డిపల్లి వార్డు సభ్యులు ఎస్ నాగరాజు ద్వారా ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. పైమాఘం గ్రామస్తుడు, లైన్ ఇన్‌స్పెక్టర్ టి కుమార్ ఐదువేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తం పదివేల రూపాయలను నల్లపరెడ్డి వార్డు సభ్యులు ఎస్ నాగరాజ మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఆర్థిక సహాయం అందుకున్న రమేష్ కుటుంబ సభ్యులు దాతలు జీ కరీం, టికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి చెంగయ్య , కె బాలయ్య, హరి, సుకుమార్, భువనేశ్వర్, మార్కొండ య్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫాగింగ్ నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

కందూరులో ఫాగింగ్

ప్రజాశక్తి-సోమల: మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరులో సోమవారం సాయంత్రం దోమల నివారణ కోసం పంచాయతీ వారు మిలాథిన్ ద్రావణాన్ని ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జయశంకర్ మాట్లాడుతూ దోమల నివారణ కోసం గ్రామంలోని అన్ని వీధులలో ఫాగింగ్ చేశామని ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దోమలు ప్రబలకుండా పంచాయతీ వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న 104 సిబ్బంది

104 వాహన సేవలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆలపల్లి గ్రామంలో డాక్టర్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో '104 ప్రజల వద్దకు వైద్యం' కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో దీర్ఘకాలిక వ్యాధు లైన అధిక రక్తపోటు, షుగర్ వ్యాధులు, సీజనల్ వ్యాధులైన జ్వరం, దగ్గు ,జలుబు , విరేచనాలు గురించి , క్యాన్సర్‌ను నివారించవచ్చునని ఆయన తెలిపారు. ఎన్‌సిడి3.0 ఈ స్క్రీనింగ్ పరీక్షలు కచ్చితంగా చేసుకోవాలని అందుకు ప్రజలందరూ సహకరించాలని, వ్యక్తిగత శుభ్రత, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ సునంద, ఏఎన్‌ఎం యాస్మిన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రామకృష్ణా రెడ్డి కళా సేవ అపూర్వం..

ప్రజాశక్తి -వెదురుకుప్పం: జానపద కళాకారుడు, పండరి భజన, చెక్కభజన, కోలాటం గురువు ఎన్ రామకృష్ణా రెడ్డి కళా సేవ అపూర్వమని, ఎన్నటికీ మరిచిపోలేదని దూరదర్శన్ పూర్వ కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఓలేటి పార్వతీశం కొనియాడారు. వెదురుకుప్పం మండలం మొండి వెంగనపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు, జానపద గురువుగా ప్రసిద్ధుడైన ఎన్ రామకృష్ణారెడ్డికి సోమవారం హార్థిక సన్మానం నిర్వహించారు. సుమారు 20 కి పైగా కళా బృందా లను తయారుచేసి అనేక ప్రాంతాలలో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారని, టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలలో కూడా వీరి కళాబృందాలు పాల్గొంటు న్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, లలిత కళాభిరామ పింఛం సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాదు రవీంద్ర భారతిలోని మినీ ఆడిటోరియంలో నిర్వహించిన 20వ వార్షిక పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. ఈ సంస్థలు ఉభయ తెలుగు రాష్ట్రాలలో కళకు సేవ చేసిన కళాకారులని గుర్తించి ప్రతి సంవత్సరం పురస్కార ప్రదానోత్స వం హార్థిక సన్మానం చేస్తాయి. ఈ సంవత్సరం చిత్తూరు జల్లా నుండి రామకృష్ణా రెడ్డికి ఆ అవకాశం దక్కడం చాలా సంతోషంగా ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కడప జిల్లా అధ్యక్షులు ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ద్రావిడ విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ జిపిడి క్రిష్టీ రామకృష్ణారెడ్డి సేవలను కొనియాడారు.

కళాకారుడు రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

అవగాహనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి

హెచ్ఐవిపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. జిల్లాలో ఎవరికైనా సురక్షిత కాని లైంగిక సంబంధం ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత హెచ్ఐవి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ హెచ్ఐవి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఏఆర్‌టి సెంటర్ వద్ద ఉచితంగా మందులు లభిస్తాయని తెలిపారు. ఈ మందులను జీవితాంతం తింటూ మంచి పౌష్టికాహారం తీసుకుంటే జీవితాంతం బతకవచ్చని తెలిపారు. అనుమానం ఉన్న వ్యక్తులు ఎవరైనా సురక్షితం కాని లైంగిక కార్య కలాపాలకు పాల్పడే వ్యక్తులు తప్పక రక్త పరీక్ష చేయించుకుని నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్ , వేణుగోపాల్, రామచంద్రారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం: ఎంపిడివో

ఎంపీడీవో శ్రీధర్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : కార్పొరేషన్ బ్యాంక్ లింకేజీ రుణాలకు దరఖాస్తు చేసు కోవాలని ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ , కాపు, కమ్మ ,ఈ బిసి, రెడ్డి, వైశ్య కార్పొరేషన్లలో బ్యాంకు సబ్సిడీ రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జనవరి 30వ తేదీ నుండి ఫిబ్రవరి ఏడవ తేదీ వరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని నమోదు చేసుకున్న వారి బ్యాంకు ఖాతా పూర్తి వివరాలు అందివ్వాలన్నారు. 21 సంవత్సరాలు నిండి 60 సంవత్సరాల లోపువున్న వారు ఏపీఓబిఎంఎం. సిజిజి. జివోవి. ఇన్ వెబ్‌సైటులో దరఖాస్తు చేసు కోవాలన్నారు.

డప్పులు కొడుతూ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -విజయపురం, నగరి :

మున్సిపల్ పరిధి కాకవేడులో ఎమ్మార్పీఎస్ నేతలు మండల ఇన్‌ఛార్జ్ కార్తీక్ మాదిగ ఆధ్వర్యంలో 'లక్షల డప్పులు –వేల గొంతులు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వావిళ్ళ శివయ్య మాదిగ, సీనియర్ నాయకులు కుమారస్వామి మాదిగ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 7 హైదరాబాదులో జరిగే ' లక్షల డప్పులు –వేల గొంతులు' మహా సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని, ప్రతి గ్రామం నుంచి హాజరు కావాలని కోరారు. ప్రతి ఒక్కరూ చంకన డప్పు వేసుకొని మహా సాంస్కృతిక ప్రదర్శనకు విచ్చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు మునిహరి, శ్రీనివాసులు, వెంకటరత్నం, రఘు, వెంకటేశులు లోకనాథం, పాండు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రథసప్తమికి ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి -విజయపురం, నగరి :

టిటిడి ఆధీనంలోని స్థానిక శ్రీ భూదేవి శ్రీదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించనున్న రథసప్తమి, ఆర్జిత కళ్యాణోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఆలయంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి వెంకటరమణ తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు స్వామికి, దేవేరులకు తిరుమంజనం, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆర్జిత కళ్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో ప్రసాద వినియోగం చేస్తామన్నారు. కళ్యాణోత్సవ ఉభయదారులకు ఆలయం తరపున ప్రసాదాలు అందిస్తామని తెలిపారు.

నిధుల మంజూరు

ప్రజాశక్తి - రామకుప్పం:

స్థానిక శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ నిధులు మంజూరుకు ఉత్తర్వులు జారీ చేశారు. 3.49 కోట్ల రూపాయలతో ఆలయ పునర్నిర్మాణం, అభిషేక మండపం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు అయినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, స్థానిక నాయకులకు ఆలయ నిర్వాహకులు పివి సితాపతి కృతజ్ఞతలు తెలిపారు.

అధునాతన పరికరాలతో విద్యాబోధన

కరపత్రాలు ప్రదర్శిస్తున్న డిగ్రీకళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

ప్రజాశక్తి - కార్వేటినగరం: అధునాతన సాంకేతిక పరికరాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా బోధన కొనసాగు తుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ఓపెన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావే శంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధునాతనమైన సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ విభాగం, లైబ్రరీ, వ్యాయామశాల, ఉచిత ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన కంప్యూటర్ స్మార్ట్‌బోర్డులు, విశాలమైన తరగతి గదులు, చదువుతోపాటు ఉద్యోగ సాధనకు అవసరమైన మెలుకువలు కల్పించే జేకేసీ విభాగం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన వెంటనే ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు సిద్ధపడాలన్నారు. ఈ క్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలసుబ్రహ్మణ్యం ఆచారి, ధనంజయరెడ్డి, సీఎన్ లత, హరిబాబు, కార్తీక్, బాబు, సరిత, భార్గవి, ఈశ్వరరెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

పరిష్కార మార్గం ఏదీ?

ప్రజాశక్తి -నింద్ర: మండల ప్రభుత్వ కార్యాలయం ఎదుట ఉన్న కొత్త దళిత వాడ సిసి రోడ్డు వంకరగా నిర్మించారు. దిగువ మురుగు నీరు వెళ్లాలంటే ఈ వంకర రోడ్డును దాటి అవతల వైపు వున్న మురుగు కాలువకు వెళ్లాల్సి వుంది. అయితే రోడ్ల పైనే కాపురాలు ఉంటున్నారు. 'మురుగునీరు వెళ్లేదె లా?' అని వారిని ప్రశ్నిస్తే 'ఇది ప్రభుత్వ రోడ్డు ఎవరూ అడగడానికి వీల్లేదు.. రోడ్ల పైనే ఉంటాం.. రోడ్ల పైనే పడుకుంటాం..' అని వారు సమాధానం ఇస్తున్నారు. పశువులు, మూగజీవాలు అవతలికి వెళ్లాలంటే భయపడు తున్నాయి. రోడ్డుపైనే మంచాలు, కుర్చీ, వాహనాలు అడ్డంగా పెడుతున్నారని దీంతో మూగ జీవాలు వెళ్లడం సమస్యగా మారిందని పాడి రైతులు, జీవాలు మేపేవారు ఇబ్బందికి గురవుతున్నారు. ప్రభుత్వ అధికారులు, తహశీల్దారు పక్క రోడ్డును వేయించి నెమ్మదిగా అక్కడి నుండి జారుకుంటున్నారు. ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

జీవాలు వెళ్లేందుకు రోడ్డుపై అడ్డంకిగా మారిన దృశ్యం

ఎన్‌టిపి క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-గంగవరం: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టిఏ)2025 క్యాలెండర్‌లు, డైరీలను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చందనం రామయ్య ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. గంగవరం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓలు వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చందనం రామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా మంచి సమాచారంతో రాష్ట్ర శాఖా తరపున ముద్రించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ తరపున ప్రభుత్వానికి అనేక ఉపాధ్యాయుల సమస్యలు తెలిపామన్నారు. సమస్యలు పరిష్కరించుకోవడంలోనూ తమ ప్రత్యేకతలు చూపుతు న్నామన్నారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏఆర్‌కుమార్, గంగవరం మండల ప్రధాన కార్యదర్శి వై గణేష్, మండల ఉప కార్యదర్శి సూర్య ప్రకాశ్, పలమనేరు మండల ఏన్‌టీఏ సభ్యులు వెంకటముని, రెడ్డి శేఖర్, మనోహర్, వడయార్, బైరెడ్డి పల్లి మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంఆర్సీ సిబ్బంది చంద్ర, రాజన్న పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న ఎన్‌టిఏ నాయకులు

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి: ఎంపిడివో

ప్రజాశక్తి -శాంతిపురం: అర్హులైన అభ్యర్థులు వివిధ కార్పొరేషన్ల రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బీసీ, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు 2024–25 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బిసి కార్పొరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన లబ్ధిదారులకు బిసి కార్పొరేషన్, చిత్తూరు వారి ద్వారా వివిధ పథకాల ద్వారా సబ్సిడీ మంజూరు చేసేందుకు దరఖాస్తుదారులు ఏపీ ఓబిఎంఎంఎస్ ద్వారా వారి పేరును ఆన్లైన్ లో ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్లాబ్ – 1లో 2 లక్షల రూపాయలకు 75 వేలు, స్లాబ్ – 2లో 3 లక్షల రూపాయలకు లక్షా 25 వేలు, స్లాబ్ – 3లో 5 లక్షల రూపాయలకు 2 లక్షల సబ్సిడీ వస్తుందన్నారు. ఈ లోన్ల కొరకు బిసిలందరూ దరఖాస్తు చేసుకొనవచ్చును. ఇబిసి కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు, కమ్మ కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ, రెడ్డి కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు, ఆర్య వైశ్య కుల ధృవ పత్రం వున్న ఓసి కమ్యూనిటీ వారు, క్షత్రియ కుల ధృవ పత్రం వున్న ఓసి కమ్యూనిటీ వారు, బ్రాహ్మణ కుల ధృవ పత్రం కలిగిన ఓసి కమ్యూనిటీ వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు . బీసీ కార్పొరేషన్, ఇబిసి, కమ్మ, రెడ్డి, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు 21 నుండి 60 సంవత్సరాల మధ్య వయసు వారు అర్హులని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు కలిగి వుండాలన్నారు. వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు, పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారం, సేవలు, రవాణా విభాగం వంటి సెక్టార్లకు సంబంధించిన యూనిట్లకు సబ్సిడీ మంజూరు చేస్తామని తెలిపారు. ఏపీఓబిఎంఎం. సిజిజి. జివోవి. ఇన్ వెబ్‌సైటులో ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విద్యాబోధనపై ప్రత్యేక తనిఖీ

ప్రజాశక్తి -విజయపురం నగరి : ఉపాధ్యాయుల విద్యాబోధనపై ఎంఈవో శ్రీదేవి సోమవారం ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. వికేఆర్ పురం పాఠశాలను తనిఖీ చేసిన ఆమె విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. హిందీ భాషలో విద్యార్థుల నైపుణ్యం కనబరచడంతో పాఠశాలలో సింగిల్ టీచర్‌గా ఉన్నా పిల్లలకు అత్యుత్తమ బోధన అందించినందుకు హిందీ టీచర్‌ను ప్రశంసించారు. అనంతరం తడుకుపేట దళితవాడ పాఠశాలను తనిఖీ చేసిన ఆమె విద్యార్థులు తెలుగు చదవడం, రాయడం సక్రమంగా చేయకపోవడంపై ప్రధానోపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు ఇది పునరావృతం కాకూడదని హెచ్చరించారు.

విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీదేవి

క్రైం న్యూస్

ప్రమాదానికి గురైన కంటైనర్, లారీ, టిప్పర్

వాహనాల ఢీ

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -బంగారు పాలెం: మూడు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని మొగిలి ఘాట్‌లో సోమవారం చోటు చేసుకుంది. బెంగళూరు నుండి తిరుపతికి వెళు తున్న కారు పలమనేరు నుండి చిత్తూరు వైపు వెళుతున్న లారీ, టిప్పర్ ఒకదానికొకటి వెనుక మూడు వాహనాలు ఢీకున్నాయి. ఈ సంఘటనలో టిప్పర్ డ్రైవర్ గంగవరం మండలం ఆరుమాకు లపల్లికి చెందిన శ్రీనివాసులుకు, తమిళనాడు దిండిగల్‌కు చెందిన చిరంజీవికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం పోలీసులు 108 సాయంతో బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న పాతపాలెం గ్రామస్తులు

వాహనం బోల్తా

ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :

టాటా ఏస్ టైరు పేలి అదుపుతప్పి బోల్తా పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక కథనం మేరకు.. సోమవారం ఎస్ఆర్ పురం మండలంలోని పాతపాలెం గ్రామానికి చెందిన గ్రామస్తులు ఎట్టేరికి గ్రామానికి ఓ కార్యక్రమానికి టాటా ఏస్ వాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో ఎస్ఆర్ పురం మండలంలోని మెదవాడ పంచాయతీ మెదవాడ కాలనీ వద్ద చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారిపై టైరు పేలి అదుపుతప్పి బోల్తా పడి పాత పాలెం గ్రామానికి చెందిన వీరబాహుడు వెంకటేష్ (28) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి,. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. గాయపడిన వారిని ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.
మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆలస్యంగా 108

ప్రమాదం జరిగి రెండు గంటలైనా 108 అందుబాటులోకి రాకపోవడంతో ఆగ్రహానికి లోనయ్యారు. చిత్తూరు –పుత్తూరు జాతీయ రహదారిపై గాయపడిన వారితో నిరసన చేపట్టారు.

పోలీసుల అదుపులో ద్విచక్ర వాహన దొంగలు

ద్విచక్ర వాహన దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : ద్విచక్ర వాహన దొంగలను పోలీసులు సోమవారం అరెస్టు చేశారని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, అర్బన్ సిఐ శంకరయ్య తెలిపారు. నియోజకవర్గ పరిధిలో గత కొద్ది రోజులకు ముందు వరుసగా ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు గురయ్యాయని, వీటిపై శాంతిపురం మండలం రాళ్ళబుదుగురు పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ విషయమై ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు, కుప్పం డిఎస్పి పార్థసారథి సూచనలతో రూరల్, అర్బన్ సిఐ లతోపాటు రాళ్ళబుదుగురు, గుడుపల్లి ఎస్ఐలు వారి బృందంతో దర్యాప్తు చేశామని తమిళనాడు రాష్ట్రానికి చెందిన సికిందర్, సేటు, యారబ్, సాదుల్లా వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుండి 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూపాయలు తొమ్మిది లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులను రిమాండ్ కు పంపించినట్లు తెలిపారు. కేసు విచారణ చేసి నిందితులను అదుపులోనికి తీసుకున్న పోలీసులను ఎస్పీ అభినందించారు.

ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహాశీల్దారు

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండలంలోని రైతులు గ్రామస్తులను సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దారు లోకనాథ పిళ్లై అన్నారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా మొత్తం 10 అర్జీలు అందాయి. అందులో ఐదు సమస్యలు పట్టాదారు పాసు పుస్తకానికి, 2 దారి సమస్యల పరిష్కారానికి, 2 భూమి సర్వేకు, 1 ఆటస్థలం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించారు. అందులో ఐదు సమస్యలు అక్కడే పరిష్కారించగా మిగిలిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.